క్లుప్తంగా

75 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 75 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న పలువురికి మందులు అందచేశారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి వీవీ రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది ఎం.ఆశాజ్యోతి, జి.నీలిమ, జి.మాధవి, జి. విజయ కుమారి పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు టార్గెట్ పూర్తి చేయాలి



పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయూష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అర్హులై ప్రతి ఒక్కరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు అన్నారు. చోడవరం, పెదపులిపాక గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో ఆయుష్మాన్ భారత్ కింద దాదాపు 34 శాతం హెల్త్ కార్డులు నమోదు చేయాల్సి ఉందన్నారు. ప్రతి గ్రామంలో అర్హులైన వారిని గుర్తించి వివరాలు నమోదు చేసి కార్డులు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. అదే విధంగా ఎన్‌డీజీ సర్వేతో వివరాలు నమోదు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. మండల పరిషత్ టీం పలు గ్రామాలు పర్యటించారు.

బాలిక అదృశ్యంపై కేసు

పెనమలూరు: గంగూరు గ్రామంలో బాలిక అదృశ్యం కావటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మహిళా మండలి కాలువ కట్ట ప్రాంతంలో పి.దుర్గారావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఆయన కుమార్తె (17) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటుంది. అయితే ఆమె ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా జాడ తెలియక పోవటంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

భర్త కనిపించటంలేదని భార్య ఫిర్యాదు

కంకిపాడు: భర్త కనిపించటంలేదంటూ భార్య పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. కంకిపాడు పోలీసుల కథనం ప్రకారం... ఈడుపుగల్లు బీసీ కాలనీకి చెందిన అంతర్వేది పాలెం పద్మ, శ్రీనివాస్ భార్యాభర్తలు. వీరికి 2002లో పెద్దల సంరక్షంలో వివాహం జరిగింది. పద్మ ఉయ్యూరు పట్టణంలోని 8, 11 వార్డులకు మహిళా సంరక్షణ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోంది. మూడున్నర ఏళ్ల క్రితం శ్రీనివాస్ హైదరాబాద్‌లో తనకు ఉద్యోగం వచ్చిందని చెప్పి వెళ్లాడు. ఏడాదిన్నర కిందటి వరకూ భార్యతో కాంటాక్టులో ఉన్నాడు. ఆ తర్వాత నుంచి భర్త గురించి ఆమెకు ఎటువంటి సమాచారం లేదు. ఇప్పటివరకు ఎదురుచూసి చేసేది లేక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు.

రేపు హనుమాన్ శోభయాత్ర

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమజ్జయంతి సందర్భంగా హనుమాన్‌జంక్షన్‌లో ఈ నెల 14వ తేదీన హనుమాన్ శోభయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు బొకినాల సాంబశివరావు, మహిళా విభాగం (మాతృశక్తి) జిల్లా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి తెలిపారు. హనుమాన్ శోభయాత్ర కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. జంక్షన్ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ప్రధాన రహదారుల మీదగా ఐటీఐ రోడ్డులోని సాయిబాబా ఆలయం వరకు హనుమాన్ శోభయాత్ర జరుగుతుందని చెప్పారు. సుమారు 100కు పైగా బైకులతో భక్తి పూర్వక ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో యువత ఈ శోభయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీబీఎస్ఈలో నూరు శాతం ఉత్తీర్ణత



గన్నవరం: సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో స్థానిక వీఎస్. సెయింట్‌జాన్స్ హైస్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా విద్యార్థుల అభినందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జి.రెబెక 500కు 486 మార్కులు, భార్గవ్ 486 మార్కులు, కె.స్టీఫెన్‌పాల్‌కు గణితంలో నూటికి నూరు మార్కులు వచ్చినట్లు చెప్పారు. ప్లస్-2లో ఎన్.హీరారేష్మి 500కు 480 మార్కులు, వి.హృదయాక్షిత 470 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీనియర్ బ్రదర్ జిమ్మికురియోకోస్, బ్రదర్ బీ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న యర్కారెడ్డి నాగిరెడ్డి



రైతులకు పచ్చిరొట్ట ఎరువులు అందిస్తున్న శ్రీనివాసచౌదరి

రామవరప్పాడు: మిల్లర్ల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం సివిల్ సప్లయిస్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పచ్చిరొట్ట విత్తనాల సరఫరా, వాటి ప్రాముఖ్యత, పంట నష్టముల నివేదికలు తయారు, వరి ధాన్యం సేకరణ, జొన్నపంట స్థితి, ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సేకరణ వంటి అంశాలను అజెండాలో చర్చించారు. ఏడీఏ బొడ్డపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జరిగిన పంట నష్టాల వివరాల నివేదికలు వెంటనే తయారు చేసి పంపాలని వీఏఏలను ఆదేశించామన్నారు. డీఎఎఫ్ విజయకుమారి మాట్లాడుతూ 30 రకాల విత్తనాల శాంపిల్స్ తమ వద్ద ఉన్నాయని వీటిని నేలలో వేసి పచ్చిరొట్ట ఎరువులో కలియ దున్నవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఏవో రంగనాథ్ బాబు మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ముత్తారెడ్డి, వెటర్నరీ వైద్యులు ప్రసన్న లక్ష్మి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఏఈఓ విజయ్‌కుమార్, వీఏఏలు మౌనిక, బిందు, రైతులు పాల్గొన్నారు.

పెనమలూరు: రైతులు నష్టపోయిన పంటలను ఎన్యూమరేషన్ చేసి రైతులకు నష్టపరిహారం అందచేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గుంటూరు శ్రీనివాసచౌదరి అన్నారు. పోరంకి వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లే జొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్యూమరేషన్ సమయంలో రైతులు వారికి జరిగిన నష్టాన్ని అధికారులకు తెలపాలన్నారు. రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీ పై పచ్చిరొట్ట ఎరువులు జీలగ, పిల్లిపెసర అందుబాటులో ఉంచామన్నారు. ఏడీఈ ఎం.సునీల్, మండల వ్యసాయాధికారి కె.శైలజ, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపలో ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ లబ్ధిదారులకు అందచేశారు. పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రజల సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలకు నిద్ర పట్టడంలేదన్నారు. కుట్రలు కుయుక్తులతో ప్రభుత్వం పై బురదజల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాల నీతిమాలిన రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీబాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ చెన్నుబోయిన జయరాం, దుర్గగుడి దుర్గగుడి మాజీ బోర్డు సభ్యుడు నెరుసు సతీష్, నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు, బడుగు వసంతరావు, కొఠారి సాంబశివరావు, పామర్తి శ్రీనివాసరావు, శివ పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు

ఉంగుటూరు: ముక్కపాడులో అసంపూర్తిగా ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ముక్కపాడులో నిర్మాణంలో ఉన్న భవనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. భవనం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్హత ఉన్నవారు గృహనిర్మాణాలు చేపట్టాలని సూచించారు. హెల్త్ క్లినిక్‌లో అన్ని రకాల సేవలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం పరిశీలన

కంకిపాడు: కంకిపాడు గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ సందర్శించారు. గ్రంథాలయంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమాలు ఆమె పరిశీలించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: గంగూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. పెనమలూరు సెక్షన్‌లో ఉదయ 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం, పోరంకి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు గమనించి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటరత్న ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థఆధ్వర్యాన పలు రంగాలలో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఎన్టీఆర్ సేవా రత్న, కళారత్న పురస్కారాలను అందించేందకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపకఅధ్యక్షులు డాక్టర్ కేఎస్ఎస్ నారాయణ మాష్టార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 20లోపు దరఖాస్తులు పంపాలని ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

16న నగరానికి గణపతి సచ్చిదానందస్వామి

పటమట(విజయవాడతూర్పు): ఏపీ ప్రభుత్వం చేపట్టిన రాజ శ్యామల సుదర్శన శ్రీలక్ష్మీ మహాయాగం ముగింపు ఉత్సవాలు, మహా పూర్ణాహుతికి గణపతి సచ్చిదానంద స్వామి హాజరుకానున్నారని దత్త పీఠం నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ మధ్యాహ్నం నగరానికి వచ్చి, 17న మహాయాగం ముగింపు ఉత్సవాలకు హాజరై తిరిగి బెంగళూరుకు వెళ్తారని పేర్కొన్నారు.

రేపు భారతీయ నృత్యపదర్శురి

విజయవాడ కల్చరల్: కళావిపంచి, శారదా కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో భారతీయ నృత్యపదర్శురి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డోకిపర్తి శంకరావు, బొప్పన నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండిట్ అంజిబాబు సమర్పణలో కథక్ నృత్యాన్ని అచ్యుత మానస, పేరిణి నృత్యాన్ని మాస్టర్ సాయి వేదాంత్, కూచిపూడి నృత్యాన్ని మృణాలని, ఆంధ్రనాట్యం అంశాన్ని నిఖిత ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

హనుమంతుని సద్గుణాలను అలవర్చుకోవాలి

పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు


హనుమాన్‌జంక్షన్ రూరల్: ఫలితం ఆశించకుండా చిత్తశుద్ధితో శ్రీరామభక్తునిగా సేవ చేసిన హనుమంతుని జీవితం ఎంతో ఆదర్శనీయమని ప్రముఖ ప్రవచనకర్త, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక వేదికపై శుక్రవారం రాత్రి ఆయన భక్తులకు ప్రవచనం అందించారు. ఆదిశంకరాచార్య రచించిన హనుమత్ పంచరత్న స్తోత్రంపై గరికిపాటి చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను కట్టిపడేసింది. అంజనీపుత్రుని వలే ధర్మం కోసం, దేశం కోసం నిస్వార్థంగా పని చేయాలని చెప్పారు. హనుమంతుని లక్షణాలైన ధైర్యం, బుద్ధి, ముందుచూపు, నిస్వార్థమైన సేవ గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఆంజనేయుని వలే పంచేంద్రియాలను జయించి జితేంద్రునిగా నిలబడినప్పుడే విజయం సిద్ధిస్తుందన్నారు. అంజనీపుత్రుడైన హనుమంతుడు హనుమాన్‌జంక్షన్ క్షేత్రంలో అభయాంజనేయ స్వామిగా ప్రపంచంలో మరెక్కడ లేని విశిష్టరూపంలో దర్శనమిస్తున్నారని చెప్పారు. యుక్త వయస్సులో ఇక్కడి దేవస్థానం వద్ద జరుగుతున్న పౌరాణిక నాటకాన్ని తిలకించేందుకు సాధారణ వ్యక్తిగా వచ్చానని, మళ్లీ అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో వందలాది మందికి ప్రవచనం అందించేందుకు రావటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్‌లు గరికిపాటి నరసింహారావుకు అభయాంజనేయ స్వామి చిత్రపటం అందించి, దుశ్శాలువాతో సత్కరించారు.



గరికిపాటి నరసింహారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఆలయ చైర్మన్

వాగ్గేయకార చరితం.. సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: వాగ్గేయకార సంగీత చరితం సదా స్మరణీయని గాయకుడు బాలాజీకుమార్ అన్నారు. మెలోడీ గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం కలిసి పాడుదాం పేరుతో వాగ్గేయకార భక్తి సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. బాలాజీకుమార్ మాట్లాడుతూ మనకు తరగని గని ఆధ్యాత్మిక సంగీతమని దాన్ని భావి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. సంగీత విద్వాంసులు కామేశ్వరి మాట్లాడుతూ రామదాసు, అన్నమయ్య లాంటి వాగ్గేయ కారుల సంకీర్తనలు సమాజంలో చైతన్యం కలిగించాయన్నారు. ఆమె ఆధ్వర్యంలో చిన్నారి శ్రుతి, సీతాదేవి, కామేశ్వరి, డి.పద్మజ, మీనాకుమారి, దిట్టకవి, పవన్‌కుమార్ రామదాసు, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజ స్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు ఆలాపించారు. వీటితోపాటు సెమీ క్లాసికల్ గీతాలను, చిన్నారి శ్రుతి ఆలపించిన రామదాసు, విష్ణుశ్వర కీర్తనలు ఆకట్టుకున్నాయి.



భక్తి గీతాలను ఆలపిస్తున్న శృతి, పవన్‌కుమార్, మీనాకుమారి, బాలాజీకుమార్ సూర్యకామేశ్వరి

మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఏపీ, తెలంగాణ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో 51వ డివిజన్‌లోని పల్లా కనకయ్య కమ్యూనిటీ హాల్లో శుక్రవారం సచివాలయం సిబ్బంది ఇతర కమ్యూనిటీ సిబ్బందికి మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు పెద్ద సంఖ్యలో అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. వారితో లైంగిక వ్యాపారానికి తెగబడుతున్నారన్నారు. వేలాది మంది తల్లిదండ్రులకు దూరమవుతున్నారని, దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని వివరించారు. నూతన సాంకేతిక మాధ్యమాలు అక్రమ రవాణాకు ఊతమిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజ్వల సంస్థ వివిధ ప్రభుత్వ సంస్థల సాయంతో వేలాది మందిని అక్రమ రవాణా నుంచి కాపాడిందని చెప్పారు. మానవ అక్రమ రవాణాపై లఘుచిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రావ్య, వినోద్‌కుమార్ పోలీసు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయా సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. పెనమలూరు గ్రంథాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించి వేసవి శిక్షణ తరగతులు పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్ణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో శిక్షణతో విద్యార్థులు, చిన్నారుల్లో విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. చదవటం, రాయటం, చిత్రలేఖనంతో పాటు వివిధ ఆటలు ఆడటం వలన ఆలోచనా శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు దాత సుధీర్ క్యారెమ్‌బోర్డు, చెస్‌బోర్డు, లూడోబోర్డు బహుమతిగా అందచేశారు. గ్రంథాలయ అధికారి పి.హరీష పాల్గొన్నారు.

యోగా మన జీవన విధానం కావాలి

గన్నవరం రూరల్: యోగా మన జీవన విధానం కావాలని పురుషోత్తపట్నం గ్రంథాలయం శాఖా లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. శుక్రవారం ప్రభుత్వం అమలు చేస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ చిన్న నాటి నుంచి యోగా అలవాటు చేసుకుంటే మానసిక సామర్థ్యం, శారీరక ధృడత్వం, స్థిరమైన ఆలోచనలు, ప్రణాళికా బద్ధమైన లక్ష్యాల సాధన సాధ్యమవుతుందన్నారు. అందుకే ప్రభుత్వం బాలలకు యోగా నేర్పాలని ఆదేశించిందన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా సాధన చేశారు.



పురుషోత్తపట్నంలో యోగా సాధనలో విద్యార్థులు

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఆర్డీవో పి.పద్మావతి

గుడివాడరూరల్: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఆర్డీవో పి.పద్మావతి అన్నారు. మండల పరిధిలోని మోటూరు గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని తహసీల్దార్ కె.ఆంజనేయులతో కలసి శుక్రవారం ఆమె పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతుల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులు జరిగాయా లేదా అనే విషయంపై రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మోటూరు గ్రామంలో ధాన్యాన్ని 64 మంది రైతులు డైరెక్ట్‌గా మిల్లర్లకు విక్రయించగా వారందరికీ నగదు చెల్లించామని, ఈ సందర్భంగా ఆర్డీవో రైతులకు వివరించారు. ఇంకా ఎవరైనా రైతులు మిల్లర్లకు అమ్మిన ధాన్యానికి సంబంధించిన నగదు అందకపోతే రైతుభరోసా కేంద్రంలో గాని, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు గాని సమాచారం అందించాలని కోరారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలు, పురుగు మందులను ఇప్పటి నుంచే సిద్ధం చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులకు గ్రామస్థాయిలోనే వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, సబ్సిడీ యంత్రాలు అందజేస్తామన్నారు. రైతుభరోసా కేంద్రం సేవలను ఆయా గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాలకు వచ్చే రైతుల పట్ల కేంద్రాల్లో సిబ్బంది మర్యాదగా నడుచుకుని వారికి కావాల్సిన వాటిని త్వరితగతిన అందచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో రైతులు నేరుగా మిల్లర్లకే ధాన్యం విక్రయించడం వల్ల నగదు అందక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రెండురోజుల క్రితం మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నగదు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ క్రమంలోనే రైతులకు ధాన్యం నగదు అందాయా లేదా అనే విషయాలను రైతుల వద్దకే వచ్చి నేరుగా తెలుసుకుంటున్నామన్నారు. ఇంకా ఏ రైతులకు అయినా మిల్లర్ల నుంచి నగదు అందకపోతే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో పద్మావతి, పక్కన తహసీల్దార్ ఆంజనేయులు

డిప్లొమో కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: విజయవాడలో గల ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమో కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను డిప్లొమో, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సుల్లో డిప్లొమో ఇన్ ప్లాస్టిక్‌మౌల్డ్ టెక్నాలజీ 10వ తరగతి పాస్ ఆ పైన, 2 సంవత్సరాల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ ఆపైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, ఓసీ విద్యార్థులు రూ.500 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే జూన్ 11వ తేదీ అడ్మిషన్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందే అర్హులైన వారందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాలకు 93985 35697ను సంప్రదించవలసిందిగా కోరారు.

రమణీయం శ్రీనివాసుని కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రమణీయంగా సాగింది. దేవదాయ శాఖ పరిధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం 'శ్రవణ' పురస్కరించుకొని ఆలయంలోని వేదికపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుణ్యాహవచనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, జీలకర్ర బెల్లం ధారణ, మాంగల్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మూలమూర్తికి తిరుమంజనం

వేంకటేశ్వరుడికి తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా శుక్రవారం ఉదయం నిర్వహించారు. అంతరాలయంలో మూలవిరాట్‌కు జరిగే కార్యక్రమాన్ని మంగళవాయిద్యాలు, హరినామస్మరణ, వేదపఠనం, మంత్రోచ్ఛరణల మధ్య జరిగింది. పంచామృతాల, వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో కూడిన అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఈఓ గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.



శ్రీనివాసుని కల్యాణం

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ఆషానాయుడు కళాబృందంలోని పలువురు నృత్యకారులు ప్రతిభను ప్రదర్శించారు.

కేబీఎన్‌లో ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని కేబీఎన్ కళాశాలలో రాష్ట్రంలోనే మొదటి సారిగా ఎంఎస్సీ (డేటా సైన్స్) కోర్సును ప్రవేశ పెడుతున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డీమ్డ్ యునివర్సిటీలు మినహా సాధారణ విద్యా కోర్సులను నిర్వహించే కళాశాలల్లో రాష్ట్రంలోనే మొదటి సారిగా తమ సంస్థ ఈ పీజీ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనుందన్నారు. కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీవోక్, తదితర డిగ్రీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. బీటెక్‌లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఈ అండ్ ఐటీ కోర్సులు పూర్తి చేసిన వారు సైతం ఈ ఎంస్సీ (డేటా సైన్స్) కోర్సు చేయటానికి అర్హులని తెలిపారు. కోర్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు

విజయవాడ కల్చరల్: మూర్తీభవించిన ధర్మానికి ప్రతీరూపం శ్రీరామచంద్రుడని ఆధ్యాత్మికవేత్త మల్లాది వెంకటరామనాథ శర్మ అన్నారు.అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవంలో భాగంగా సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాలలో శుక్రవారం వెంకటరామనాథ శర్మ సుందరవైభవం, శ్రీమద్రామయణాంతర్గత హనుమత్ వైభవంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాముడు వ్యక్తికాదని ఆధ్యాత్మిక శక్తిగా అభివర్ణించారు. హనుమంతుడులేనిదే రామకథలేదన్నారు. సీతాన్వేషణ సమయంలో హనుమంతుడు లంకకుచేరి సీతాదేవిని చూసి చలించిపోయాడన్నారు. రాముడు ఇచ్చిన ఉంగరం చూపించడంతో రామదూత హనుమంతుడు వచ్చిడని భావించినట్లు తెలిపారు. సర్వకార్యాలను విజయవంతగా చేయడం హన్మత్ లక్షణమన్నారు. సుందరాకాండ పారాయణం సర్వశ్రేయోదాయకమని తెలిపారు. దేవాలయ పాలకమండలి సభ్యులు హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.